manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 205 | బుధవారం | 22.01.2025




## లబ్ధిదారుల ఎంపిక

# నిరంతర ప్రక్రియ

### శామీర్‌పేట్ గ్రామసభలో కలెక్టర్ రిజ్వాన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :**

లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని కలెక్టర్ రిజ్వాన్ బాషా పేర్కొన్నారు. మంగళవారం జనగామ మండలంలోని శామీర్ పేట్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజాపాలన గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 26న ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా, ఇంది రమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేయనున్న నేపథ్యంలో ప్రజాపాలన గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అర్హులకు ఈ పథకాల కింద సాయం అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రజాపాలనలో భాగంగా భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు సంవత్సరానికి రూ.12,000 అందించడం జరుగుతుందని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నమోదు చేయబడి, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఇంకా మిగిలిపోయిన అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారిని కూడా ఈ పథకంలో చేర్చడం జరుగుతుందని వివరించారు. వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమమే



ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత అంశంగా రైతు భరోసా పథకం కింద పంట పెట్టుబడి సహాయాన్ని ప్రతి సంవ త్సరం ఎకరాకు రూ.12,000 పెంచడం జరిగిందని, వ్యవసాయ యోగ్యమైన అన్ని భూములకు ఈ సహా యాన్ని అందించేందుకు నిర్ణయించిందని, వ్యవసాయ యోగ్యం కాని భూములకు ఈ సహాయం వర్తించదని, అర్హులైన రైతులందరూ ఈ పంట పెట్టుబడి సహాయా న్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డు లేని నిరుపేదలను గుర్తించి, అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. మీసేవా ద్వారా రేషన్ కార్డుల్లో అదనపు కుటుంబ సభ్యులను చేర్చడానికి వచ్చిన దరఖాస్తులు గ్రామసభల ద్వారా ఆమోదించుకుని, అదనపు కుటుంబ సభ్యులను చేర్చడం జరుగుతుందన్నారు. ఇంతేకాకుండా, ఎవరైనా కొత్తగా దరఖాస్తులు ఇవ్వదలచుకుంటే, వాటిని కూడా స్వీకరించి, పరిశీలన చేయడం జరు గుతుందన్నారు. గ్రామసభలకు హాజరుకాలేని వారు మండల కేంద్రంలో, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తులు ఇవ్వవచ్చన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గత గ్రామసభలో ఇళ్లు లేని వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి, క్షేత్ర స్థాయిలో పరిశీలించ డం జరిగిందన్నారు. ఈ క్షేత్ర పరిశీలనలో ఇంటి స్థితి గతులను, ఇప్పుడు నివసిస్తున్న ఇంటి కప్పు వివరాలు, ఇల్లు నిర్మించుకోవడానికి కావల్సిన స్థలాన్ని పరిశీ లించి, చిత్రాలు కూడా తీసుకోవడం జరిగిందన్నారు. 40 ఏళ్ల లోపు వితంతువులు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులు, భూమి లేని నిరుపేదలు ఉపాధి హామీ కూలీలు, ట్రాన్స్ జెండర్లను ప్రత్యేకంగా గుర్తించడం జరిగిందని, ఇల్లు కట్టుకునేందుకు స్థలం ఉన్న వారిది ఒక జాబితాగా, స్థలం లేని వారిది రెండవ జాబితాగా ఈ గ్రామసభల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. ఇందులోని వివరాలను సరిచూసుకోవాల్సిందిగా కోరారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయ గలరని విజ్ఞప్తి చేశారు. అన్ని వివరాలు సేకరించిన తరువాత అర్హులైన అందరికి ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంపత్ కుమార్, జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, గ్రామప్రజలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

3

- భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు



## డాక్టర్లు సమయపాలన పాటించాలి

3

- వరంగల్ డీఎంహెచ్‌వో సాంబశివరావు




## జిల్లాలో జోరుగా గ్రామసభలు

2

- పాల్గొన్న ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణారెడ్డి

General News







## జిల్లాలో జోరుగా గ్రామసభలు

**జనగామ, మన చౌరాస్తా :** ఈ నెల 26న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో గ్రామసభల నిర్వహణ నేటి నుంచి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణా రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈఓ, ఆర్డీఓలు, ఎస్డీసీలు, మండల ప్రత్యేక అధికారులు గ్రామాల్లో జరుగుతున్న ప్రజాపాలన గ్రామసభల్లో పాలుపంచుకున్నారు. మంగళవారం జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని చిల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని లింగాల ఘనపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పాల్గొనగా, జాఫర్‌గడ్‌లో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ ముఖ్య



అతిథిగా పాల్గొన్నారు. అదే విధంగా జిల్లాలో గల 12 మండలాల్లోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో జిల్లా, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, క్లస్టర్ అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, గ్రామ సభలను నిర్వహించారు.



## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**చేర్యాల, మన చౌరాస్తా :** మండలంలోని వీరన్నపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించుకుని విద్యార్థులే ఉపాధ్యాయులయ్యారు. ఇందులో డీఈవోగా బింగి అజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలుగా వర్షిత వ్యవహరించగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా ఒకరోజు విద్యాబోధన చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్లమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి ఒకరోజు పాఠశాల బోధన సక్రమంగా నిర్వహించారని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తి యొక్క ఔన్నత్యాన్ని సాధక బాధకాలను ఒకరోజు నిర్వహణ ద్వారా తెలుసుకున్నారని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన అనుభవాలను సమావేశంలో వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతుల ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, ప్రసాద్, మల్లేశం, రాజయ్య, కొండల్ రెడ్డి, శ్రీనివాస్, షబానా బేగం తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** రాష్ట్ర పద్మశాలి సంఘం నాయకులు మంగళంపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలోని గోపాల్ నగర్ ఆర్వీఎం చారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో గుర్రపు బాలరాజు మాట్లాడుతూ ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మధు ప్రసాద్, వస్తాం పోచయ్య, గణపురం నాగేష్, చింతల కర్ణాకర్, వల్లాల సత్యనారాయణ, వల్లాల శ్రీను, నీల పవన్, మచ్చ నరేందర్, పెండం నాగేష్, బేది కృష్ణమూర్తి, గుండా కేశవులు, సత్యనారాయణ, మచ్చ నాగేష్ పాల్గొన్నారు.





## నిత్య ప్రసాద వితరణశాలకు విరాళం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మల్లికార్జున స్వామి నిత్య ప్రసాద వితరణశాలకు హైదరాబాదుకు చెందిన రాగం సంజయ్ యాదవ్, రాగం జగ్గయ్య యాదవ్ రూ.1,00,116లను మంగళవారం విరాళంగా అందించి మహారాజ పోషకులుగా సభ్యత్వం తీసుకున్నారు. ఆలయ ఈవో రామాంజనేయులు వారికి రసీదును అందజేసిన సందర్భంగా మాట్లాడుతూ దేవాలయానికి దాతల సహకారం ఎంతో అవసరమని త్వరలోనే 100 రూముల సత్ర నిర్మాణం జరుగుతుందని అందరు భక్తులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, రాగం శంకర్ యాదవ్, బొల్లారం జగదీష్ యాదవ్ తదితరులు ఉన్నారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** నారాయణపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాళ్ల రవి తండ్రి కాళ్ల రామయ్య, ఇటికలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జెరిపోతుల అంజయ్య తల్లి బాలసిద్దవ్వ మరణించగా విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. చేర్యాల పట్టణంలోని బీరుకూరు చిరంజీవికి 58,000 తుమ్మ జానకి 38,000, జువ్వాది శ్రావణ్ 18,000, యాంసాని భువనేష్ 35,000, వేచరేనికి చెందిన బుద్ధి నరసయ్య 30,000, రామ్ సాగర్ కు చెందిన తాడూరి భాస్కర్ 40 వేలు, పోతిరెడ్డిపల్లి కి చెందిన కూడేళ్ల లక్ష్మయ్య 60,000, వీరన్నపేట గ్రామానికి చెందిన గౌండ్ల స్రవంతికి 30 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, నాయకులు తుమ్మ శ్రీనివాస్, తుమ్మ కుమార్, తుమ్మ ప్రశాంత్, తుమ్మ సురేష్, తుమ్మ యాదయ్య, తుమ్మ బిక్షపతి, జువ్వాది అనిల్ తదితరులు పాల్గొన్నారు.

Local News




# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

■ **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**భూపాలపల్లి , మన చౌరాస్తా :** ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26వ తేదీ నుండి అమలు చేయబోతున్న నాలుగు సంక్షేమ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రజా ప్రభుత్వంలో అర్హులైన అసలైన లబ్ధిదారులకే అందేలా చూస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గం చిట్యాల మండలంలోని జూకల్, చల్లగరిగ, కొత్తపల్లి గోరి మండలంలోని సుల్తాన్ పూర్, గణపురం మండలంలోని కర్కపల్లి గ్రామాలలో జరిగిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హుల ఎంపికకు సంబంధించి గ్రామ సభలు జరగ్గా, ఆయా గ్రామాలల్లో జరిగిన గ్రామ సభలల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభలల్లో ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26 నుండి ఈ నాలుగు పథకాలను ప్రారంభించనున్నదని, పథకాల అమలులో భాగంగా ఈరోజు నుండి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో గ్రామస్తులను, ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములను చేయాలన్నారు. కొత్తగా ప్రారంభించబోయే నాలుగు పథకాలు ఓ అద్భుతమని కార్యక్రమం అని, ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే అన్నారు. రాబోయే నాలుగేళ్లలో పేదవాడి సొంతింటి కల నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## కాటమయ్య రక్షణ కిట్లు అందజేత



భూపాలపల్లి గ్రామీణ మండలం ఎస్.యం కొత్తపల్లి గ్రామ శివారులోని సోలిపేట తాటి వనం(కల్లు మండువా) వద్ద భూపాలపల్లి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 82 మంది కల్లు గీత కార్మికులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాటమయ్య రక్షణ కిట్లని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గౌడన్నలు తమ వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి కల్లు తీసే క్రమంలో ఆకస్మికంగా ప్రమాదాలు జరిగి చనిపోవడం, శాశ్వత వైకల్యానికి గురి కావడం జరుగుతుందని అన్నారు . ఇది గమనించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం దృష్టి సారించి, వారి భద్రత కొరకు సేఫ్టీ కిట్లను తయారు చేయించి వారి కుల దైవం అయిన కాటమయ్య పేరు పెట్టి కాటమయ్య రక్షణ కవచం పేరుతో గౌడన్నలకు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో ఒక్కో కిట్ లో మొత్తం ఆరు పరికరాలు ఉంటాయని అన్నారు. తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్ బ్యాగ్, లెగ్ లూప్ వంటివి వేర్వేరుగా ఉంటాయని తెలిపారు.

# రవికుమార్ గౌడ్ కు అంతర్జాతీయ అవార్డు



**చేర్యాల, మన చౌరాస్తా :** కరాటేలో నైపుణ్యాన్ని సాధించి ఆ విద్యను నలుగురికి నేర్పుతున్న చేర్యాల పట్టణానికి చెందిన ఛాంపియన్ షోటోకన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, గ్రాండ్ మాస్టర్ బుడిగె రవికుమార్ గౌడ్ కు ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కార్ అవార్డు ప్రధానం చేశారు. జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో ఎంతో మంది కరాటే విద్యార్థులను ఛాంపియన్లుగా తయారు చేస్తూ ఎన్నో బహుమతులు పొందటంలో విశేష పాత్ర పోషిస్తున్నాడు. కేజీ టూ పీజీ గురుకుల విద్యార్థులకు కరాటే శిక్షణ ఇస్తూ పలు గురుకుల విద్యాసంస్థలలో కరాటే మాస్టర్లను తయారు చేస్తున్నాడు. అలాగే 100 పైగా విద్యార్థులకు కరాటే ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు లేని అనాథ విద్యార్థులకు కరాటే ఉచిత శిక్షణ ఇస్తున్నాడు. ఈ కార్యక్రమంలో 8 విదేశాల నుండి వచ్చిన ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్లు కేశవ్ అకాడమీ వారు బిర్లా సైన్స్ సెంటర్ ఆడిటోరియంలో శాలువాతో ఘనంగా సన్మానించి అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ఎనిమిది విదేశాల నుండి వచ్చిన కరాటే గ్రాండ్ మాస్టర్లు పాల్గొన్నారు. వారికి చిన్ననాటి కరాటే గురువు కరాటే మాస్టర్ ఎం. ఎస్ పాషా, మానవతా యువజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి అంజయగౌడ్, అంబటి శ్రీనివాస్ గౌడ్, ఎండి.యూనీస్, రిటైర్డ్ ఆర్మీ ఎం.అశోక్, చెన్నూరు రమేష్, అంబటి శ్రీదర్ గౌడ్, అంబాల శ్రీనువాస్ గౌడ్, విధ్యార్తి నాయకులు పంతం రాజేష్, అతుకూరి కనకయ్య అభినందనలు తెలిపారు.



# పేదలకు సేవ చేయడం అభినందనీయం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్న పేట మండలం కొన్నె గ్రామంలో మంగళవారం కొడురు పాండరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ క్యాన్ల పంపిణీ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామంలో శివకుమార్ ఎంతో కొంత సేవ చేయాలనీ కుటుంబం తరుపున ఇప్పటి వరకు రాజకీయాలకు అతీతంగా మంచి కార్యక్రమాలు చేస్తున్నారు. భవిష్యత్ లో ఈ విధంగా సహాయ సహకారాలు పార్టీలకు అతీతంగా అందించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్టు చెప్పారు.

# డాక్టర్లు సకాలంలో రావాలి



**వరంగల్ , మన చౌరాస్తా :** వైద్యులు సకాలంలో వచ్చి సమయపాలన పాటించి పేదలకు ఆరోగ్య సేవలందించాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు అన్నారు. బస్తీ దావకాన గిరి ప్రసాద్ నగర్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రంగసాయిపేట , ఏరియా హాస్పిటల్ వర్ధన్నపేటలో పర్యటించి వైద్య సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవల గురించి, సమయపాలన గురించి వివరించారు. చలికాలంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని కోరారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని కోరినారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని తెలిపినారు. మహిళా ఆరోగ్య క్లినిక్లు, ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించినారు కాబట్టి సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. ఏరియా హాస్పిటల్ వర్ధన్నపేటలో సూపర్డెంట్ డాక్టర్ రామ్మూర్తి , సిబ్బందితో సమీక్షించి ప్రజలకు అందించవలసిన సేవల గురించి హాస్పిటల్లో సిబ్బంది విధుల గురించి చర్చించి తగిన సేవలు సమయానుకూలంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్మూర్తి సూపర్డెంట్ వర్ధన్నపేట ,డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ మోహన్ సింగ్ ,ఏరియా హాస్పిటల్ వైద్యాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు , డెమో అనిల్ కుమార్, ఏరియా హాస్పిటల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

# జనగామలో రోడ్డు ప్రమాదం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్ పీ ఆర్ స్కూల్ సమీపంలో సూర్యాపేట జనగామ ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు స్కూల్ విద్యార్థులతో పాటు ఆటో డ్రైవర్ కు తీవ్ర గాయలయ్యాయి. గాయాలైన వారిని చికిత్స నిమత్తం జనగామ ఆసుపత్రికి తరలించారు. లింగాల గణపురం మండలానికి చెందిన విద్యార్థులు స్కూల్ నుండి ఆటోలో ఇంటికి వెళుతుండగా ఘటన జరిగిటనట్లు స్థానికులు చెప్పారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఆరుగురు విద్యార్థులు సెయింట్ మేరీస్ స్కూల్ కు చెందిన వారు కాగా మరొకరు సాన్ మారియా పాఠశాలకు చెందినవారిగా గుర్తించినట్లు సమాచారం.




## కెరీర్లను డిసైడ్ చేయబోతున్న సినిమా

మెగా ఫ్యామిలీ హీరో వరుణ్ తేజ్ కెరీర్ కొన్నేళ్ల నుంచి తిరోగమనంలో పయనిస్తోంది. అతడికి సోలో హీరోగా ఓ మోస్తరు విజయం దక్కి కూడా చాలా ఏళ్లయిపోయింది. గని, గాండీవధారి అర్జున్, ఆపరేషన్ వాలెంటైన్, మట్కా.. ఇలా సోలో హీరోగా తన చివరి సినిమాలు ఒకదాన్ని మించి ఒకటి డిజాస్టర్లవడంతో తన మార్కెట్ దారుణంగా దెబ్బతింది. ముఖ్యంగా 'మట్కా' కొట్టిన దెబ్బ అలాంటిలాంటిది కాదు. ఈ చిత్రానికి మినిమం ఓపెనింగ్స్ లేవు. పెట్టుబడిలో ఐదో వంతు కూడా థియేటర్ల నుంచి వెనక్కి తేలేకపోయిందీ చిత్రం. దీంతో వరుణ్ కొత్త ప్రాజెక్టుల మీద ప్రభావం పడే పరిస్థితి వచ్చింది. అతను హీరోగా యువి క్రియేషన్స్ సంస్థలో మేర్లపాక గాంధీ తెరకెక్కించాల్సిన చిత్రం ఆగిపోయినట్లు వార్తలు వచ్చాయి. కానీ యువి సంస్థ ఈ చిత్రాన్ని ముందుకు తీసుకెళ్లడానికే నిర్ణయించింది. తాజాగా ఈ చిత్రాన్ని అనౌన్స్ చేశారు కూడా. వరుసగా సీరియస్ సినిమాలు చేసి ఎదురు దెబ్బలు తిన్న వరుణ్ తేజ్.. ఈసారి కామెడీ ట్రై చేయబోతున్నాడు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా చిత్రాల్లో చక్కటి వినోదం అందించిన మేర్లపాక గాంధీ.. అదే స్టయిల్లో వరుణ్ సినిమాను రూపొందించబోతున్నాడు. వీరి కలయికలో రానున్న సినిమా రాయలసీమ నేపథ్యంలో సాగనుంది. దీనికి 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్ కూడా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో క్రిష్ కుటుంబ సంస్థ అయిన 'ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్' కూడా భాగస్వామి కానుంది. తొలి రెండు చిత్రాలతో ప్రామిసింగ్‌గా కనిపించిన మేర్లపాక గాంధీ కూడా తర్వాత కృష్ణార్జున యుద్ధం, లైక్ సబ్‌స్క్రైబ్ షేర్ చిత్రాలతో తీవ్రంగా నిరాశపరిచాడు.